www.prajasakti.com

ప్రజాశక్తి

శుక్రవారం 22 ఆగస్టు 2025

5

ఏలూరు

13న మెగా లోక్ అదాలత్

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి జూనియర్ సివిల్ కోర్టులో సెప్టెంబర్ 13వ తేదీన జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు కోరారు. కోర్టు ఆవరణలో న్యాయవాదులతో లోక్ అదాలత్‌పై గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. మెగా లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంకు రికవరీ, చెక్ బౌన్స్, బిఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదాలు, మనోవర్తి, ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చుని తెలిపారు. ప్రతిరోజూ ఫ్రీ లోక్ అదాలత్ సెట్టింగ్స్ నిర్వహిస్తున్నారన్నారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

గోదా'వర్రీ'..!

భయం గుప్పెట్లో విలీన మండలాల ప్రజలు

సుమారు 45కుపైగా గ్రామాలకు నిలిచిన రాకపోకలు

పునరావాస కేంద్రాలకు తరలుతున్న బాధితులు

పోలవరం నుండి 11.09.220 క్యూసెక్కుల నీరు విడుదల

విలీన మండలాల్లో కలెక్టర్, జెసి, జిల్లా అధికారుల మకాం

కుక్కునూరు: పునరావాస కేంద్రాలకు తరలుతున్న బాధితులు

కుక్కునూరు: ప్రధాన రహదారిపైకి చేరిన వరద నీరు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

గోదావరికి వరద పోటెత్తుతోంది. భద్రాచలంలో గోదావరి నీటిమట్టం గురువారం 51.5 అడుగులు దాటి మూడో ప్రమాద హెచ్చరికకు సమీపంలో ఉండటంతో మండలంలోని ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఓవైపు వరద, మరోవైపు వర్షాలతో జనం విలవిల్లాడుతున్నారు. ఇప్పటికే గుండేటి వాగు కాజ్‌వేను వరద ముంచెత్తడంతో దాచారం, నెమలిపేట, సీతారామపురం, అరవపల్లి వంటి 12 గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. ముత్యాలంపాడు, వింజరం మధ్యగల పాలవాగుపై కాజ్‌వే ముంపునకు గురైన సంగతి తెలిసిందే. గురువారం సీతారామ నగరం-వేలేరు మార్గంలో వెంకటాపురం ఎస్‌సి కాలనీ, బిసి కాలనీ నడుమ ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరడంతో 13 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. గోదావరి వరద పెరుగుతుండడంతో ముందస్తుగా చర్యగా గొమ్ముగూడేనికి చెందిన 253 కుటుంబాలు రావికుంటలోని పునరావాస కాలనీకి చేరుకున్నాయి. వేలేరుపాడు మండలంలోని రేపాకగొమ్ము గ్రామంలోని 20 కుటుంబాలు సైతం ఇదే కాలనీకి వచ్చాయి. ముంపు ప్రాంతాలలో పర్యటించిన జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి కౌండిన్యముక్తి గ్రామంలోని 40 కుటుంబాలను మర్రిపాడులోని పునరావాస కాలనీకి తరలించే ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే బూర్గంపాడు-సారపాక మధ్య ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరడంతో కుక్కునూరు-భద్రాచలం మధ్య రాకపోకలు నిలిచాయి. దీంతో ఆర్‌టిసి బస్సులు బూర్గంపాడు వరకే రాకపోకలు సాగిస్తున్నాయి. వరద ఉధృతి శుక్రవారం కూడా కొనసాగితే కుక్కునూరు ఎ బ్లాక్, లచ్చిగూడెం, బెస్తగూడెం, ఎస్‌సి కాలనీ, ఎల్లప్పగూడెం, బాపన్నగూడెం గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సిన పరిస్థితి ఉంటుంది.

రుద్రమకోట వెళ్లేందుకు పడవ కోసం ఎదురుచూస్తున్న జనం

బోటుపై వెళ్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జెసి ధాత్రిరెడ్డి

వరద ప్రభావిత ప్రాంతాల్లో జెసి పర్యటన

వరద బాధితులకు ఎటువంటి అసౌకర్యమూ కలగకుండా పూర్తిస్థాయిలో సహాయ కార్యక్రమాలు అందించాలని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంతాలైన మండలంలోని లచ్చిగూడెం, కాకినూర్ గ్రామాలను సందర్శించి ఆయా గ్రామాల ప్రజల సమస్యలను జెసి అడిగి తెలుసుకున్నారు. వారికి నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. వరద సహాయ కేంద్రంలో భోజనం తయారీ, వైద్య కేంద్రం నిర్వహణ, అందుబాటులో ఉన్న మందులను జెసి పరిశీలించారు. ఆమె వెంట జెడ్‌పి సిఇఒ శ్రీహరి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నెల రోజులైనా నేటి వరకు పట్టించుకున్న నాధుడే లేడు

మునిగెల ఏసుబాబు, గొమ్ముగూడెం వరద బాధితుడు

గోదావరి వరద పెరుగుతుందని గత జులైలో మా గొమ్ముగూడెం గ్రామంలోని కుటుంబాలను ముందస్తుగానే రావికుంట పునరావాస కాలనీకి తరలించారు. ఇక్కడికి వచ్చి నెల రోజులు దాటింది. ఇప్పటి వరకు మమ్మల్ని పట్టించుకున్న నాధుడే లేడు. బుధవారం నాడు కలెక్టర్, అధికారులు రావడంతో స్థానిక అధికారులు హడావుడి చేస్తున్నారు. మాకు బియ్యం, కూరగాయలు అందించాలి. కరెంటు, మరుగుదొడ్లు, వంటి అన్ని సౌకర్యాలు కల్పించాలి.

సహాయక చర్యల కోసం సిద్ధంగా ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు

వేలేరుపాడు రూరల్: నాలుగు రోజులుగా పెరుగుతున్న గోదావరి వరద ఉధృతి మండలంలోని ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. మండలంలో ఇప్పటికే నాలుగు రోజులుగా ప్రధాన రహదారులు నీట మునిగి ఉండటంతో జనజీవనం స్తంభించింది. దీంతో ప్రజలు నానావస్థలు పడుతున్నారు. గోదావరి పరివాహక ప్రాంతాలైన రుద్రమకోట, రేపాకగొమ్ము, తాట్కూరుగొమ్ము, కొయిదా వెళ్లే మార్గంలో రహదారులు మునిగిపోవడంతో నాళ్లవరం, కొత్తూరు, కొయిదా, కాచారం తదితర 20 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. అత్యవసర పరిస్థితుల్లో కొండగుట్టలపై నుంచి మోటార్ సైకిళ్లపై ప్రమాదకర పరిస్థితుల్లో యువత రాకపోకలు సాగిస్తున్నారు. గోదావరి వరద ఉధృతి ఇంకా పెరిగే అవకాశం ఉందనే సమాచారంతో మండల వాసులు తీవ్ర భయభ్రాంతులకు గురవుతున్నారు. లోతట్టు ప్రాంతాలలో కలెక్టర్ వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి గురువారం పర్యటించారు. మండలంలోని చిగురుమామిడి గ్రామంలో ప్రజలతో మమేకమై వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. నిత్యావసర సరుకులు, కూరగాయలు, కొవ్వొత్తులు, జెట్ కాయిల్స్ అన్నీ సిద్ధంగా ఉంచామని, ప్రజలు అధైర్య పడొద్దని సూచించారు.

వరద ప్రభావం తగ్గేవరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలి

అధికారులతో సమీక్షించిన కలెక్టర్ వెట్రిసెల్వి

వరద ప్రభావం తగ్గే వరకు అధికారులు అంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆదేశించారు. గురువారం వేలేరుపాడు తహశీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో వరద తాజా పరిస్థితి, సహాయ పునరావాస కార్యక్రమాలపై వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్షించారు. పునరావాస కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు, తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. 31 నివాసిత ప్రాంతాలకు విద్యుత్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయగా, రేపాకగొమ్ము, తాటుకూరుగొమ్ము, రుద్రమకోటకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించినట్లు విద్యుత్ శాఖాధికారులు తెలిపారు. వేలేరుపాడులో 6, కుక్కునూరులో 3 జనరేటర్లను సిద్ధం చేశామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ 12 బోట్లు, 24 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచామన్నారు. ఎద్దువాగు,పెద్దవాగు వరద పరిస్థితిపై సమీక్షించారు. సమావేశంలో జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎం.వి.రమణ, ఐటిడిఎ పిఒ కె.రాములునాయక్, ఫిషరీస్ డిడి బి.నరసయ్య, జిల్లా వైద్యాధికారి ఎస్.జీతేంద్ర, విద్యుత్ శాఖ ఎస్ఇ పి.సాల్మన్‌రాజు, డిఇ ఫీర్‌అహ్మద్‌ఖాన్, సర్వే ఎడి అన్సారీ, తహశీల్దార్లు స్లీవన్‌జోజి, చలపతిరావు, ఎస్ఐ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలవరం నుండి 11.09.220 క్యూసెక్కుల నీరు విడుదల

పోలవరం: ఒడిశా, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి ఉపనదులు కడెం, మంజీర, హరిద్ర, ఇంద్రావతి, మానేరు, ప్రాణహిత, కిన్నెరసాని, శబరి, సీలేరు ఉప్పొంగుతున్నాయి. దీంతో గోదావరి నీటిమట్టం అనూహ్యంగా పెరుగుతోంది. గురువారం సాయంత్రం పరిస్థితిని పరిశీలిస్తే పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 11,09,220 క్యూసెక్కుల జలాలను దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 33.160 మీటర్లు, స్పిల్వే దిగువన 24.730 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్ ఎగువన 34 మీటర్లు, దిగువ కాఫర్ డ్యామ్ దిగువన 24.100 మీటర్లు, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ మధ్య 16.020 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు. అదనంగా వస్తున్న వరద జలాలు స్పిల్వే 48 గేట్ల నుండి దిగువకు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న దళితులు

లీజు సొమ్ము అందరికీ పంచాలి

కలెక్టరేట్ వద్ద దళితుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

గత 40 సంవత్సరాలుగా కొనసాగుతున్నట్లే భూముల లీజు వాటాలు అన్ని కుటుంబాలకూ సమానంగా పంచుకునేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మండవల్లి మండలం ఉనికిలి గ్రామానికి చెందిన దళితులు గురువారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత మహాసభ రాష్ట్ర ప్రచార కార్యదర్శి కోరబంది బాబూరావు మాట్లాడుతూ ఉనికిలిలో మాల, మాదిగ, మాలదాసు సామాజిక తరగతులకు చెందిన తాము ఫీల్డ్ లేబర్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ సభ్యులుగా ఉన్నందున 150 ఎకరాల భూమి కేటాయించి, అందులో జిరాయితీ అనగా పట్టా తప్పించి పట్టాలను 69 ఎకరాలకు మాత్రమే మనిషికి ఎకరం చొప్పున ఇచ్చారన్నారు. నాటి నుండి నేటి వరకు 330 మంది కుటుంబాలు దానిపై వస్తున్న ఆదాయం సమానంగా అనుభవిస్తున్నామన్నారు. సొసైటీ ప్రెసిడెంట్, సెక్రటరీలను ఎన్నుకోవడం, ఆడిట్ చేయించడం వంటివన్నీ సక్రమంగా జరుగుతున్నాయని, కొంతకాలం క్రితం వేరే గ్రామానికి చెందిన వ్యక్తులు తమ సొసైటీలో 76.14 ఎకరాలు నకిలీ పట్టాలు సృష్టించి తమ సొసైటీ భూమిని కాజేయాలని ప్రయత్నించారన్నారు. అయితే అధికారులు విచారణ చేసి ఆ నకిలీ పట్టాలు రద్దు చేశారని తెలిపారు. ఆ 76 ఎకరాల భూమి ప్రస్తుతం కోర్టు వివాదంలో ఉన్నప్పటికీ స్థానిక తహశీల్దార్ సహకారంతో కొందరు చెరువులు తవ్వి చేపలు సాగు చేస్తున్నారని, భారీగా చేపల మేత చెరువుల వద్దకు తరలించారని తెలిపారు. ఈ విషయం స్థానిక తహశీల్దార్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలూ తీసుకోకుండా అక్రమంగా సాగుదారులకు మద్దతిస్తున్నారని ఆరోపించారు. అంతేకాక అక్రమ సాగుదారులు తమ సొసైటీ పట్టాదారులను ఎవరి ఎకరం లీజు వారే తీసుకోవాలని, అందరికీ పంచొద్దని చెప్పి, డబ్బు ఆశ పెట్టి 69 ఎకరాల పట్టాదారులను రెచ్చగొడుతున్నారన్నారు. పట్టాదారులు ఎవరి ఎకరం లీజు వాళ్లు తీసుకుంటే నకిలీ పట్టాదారులు 76.14 ఎకరాలు కాజేయడానికి వీలుగా ఉంటుందనే ఉద్దేశంతో కుట్రపన్నుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడు వాళ్ల మాటలు లోబడి తమ సొసైటీ పట్టాదారులు అందరికీ లీజు పంచబోమంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సొసైటీ పట్టాదారులపై తగు చర్య తీసుకుని లీజు డబ్బులు అన్ని కుటుంబాలకు పంచేలా చర్యలు తీసుకోవాలని, 76 ఎకరాలు అక్రమంగా సాగు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నా అనంతరం డిఆర్‌ఒ విశ్వేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి

ఎంఎల్‌సి గోపీమూర్తి

ఉంగుటూరులో పర్యటన

25న విజయవాడలో మహాధర్నా

జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఉపాధ్యాయ ఎంఎల్‌సి గోపీమూర్తి అన్నారు. ఆయన ఉంగుటూరు మండలంలో పలు జిల్లా పరిషత్ హైస్కూల్స్, జూనియర్, డిగ్రీ కళాశాలలను కృతజ్ఞతా పర్యటనలో భాగంగా గురువారం సందర్శించారు. తనను గెలిపించినందుకు ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఎల్‌సి మాట్లాడుతూ ఉపాధ్యాయుల, పాఠశాలల సమస్యలను పరిష్కరించాలని, కేంద్ర ప్రభుత్వం మెమో నెంబర్ 57 ప్రకారం 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలని, ఫార్మేట్ సమ్మేటివ్ పరీక్షలను పాత పద్ధతుల్లోనే నిర్వహించాలని, ఈ నెల 25న విజయవాడలో 2003 టీచర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో జరగనున్న మహా ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ఇప్పుడు ప్రవేశపెట్టిన బుక్లెట్ విధానం విద్యార్థులకు, ఉపాధ్యాయులకు ఇబ్బందికరంగా ఉందని, పునరాలోచించాలని కోరారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాల నిర్వహణకు జిల్లా పరిషత్ హైస్కూల్స్‌లో నాన్ టీచింగ్ స్టాఫ్, కంప్యూటర్ ఆపరేటర్లను నియమించాలని, ప్రాథమిక పాఠశాలల ఆన్‌లైన్ కోసం క్లస్టర్ వారీగా ఒక కంప్యూటర్ ఆపరేటర్ నియామకం చేయాలని కోరారు. ఉపాధ్యాయ సమస్యలపై నిరంతరం మీ కోసం పోరాడుతూ, మీ వెంటే ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు షేక్ ముస్తఫా ఆలీ, ఉంగుటూరు మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వునుముల రాంబాబు, డాకి జోగినాయుడు, జిల్లా కార్యదర్శులు సిహెచ్.శ్రీధర్, కె.కమలకుమార్, జిల్లాకార్యవర్గ సభ్యులు నరసింహారావు, కోశాధికారి ఊట ఆనంద్‌కుమార్, జిల్లా కౌన్సిలర్ బొమ్మిడి ప్రసాద్, అల్లు శ్రీనివాస్ ప్రసాదరాజు, మండల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో ఎంఎల్‌సి గోపీమూర్తి

ఆగ్రహించిన అంగన్‌వాడీలు

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ

ధర్నాలు, మానవహారాలు, అధికారులకు వినతులు

నల్ల చీరలు ధరించి నిరసన

బ్లాక్ డే విజయవంతం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అంగన్వాడీ వర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో గురువారం బ్లాక్ డే పాటించి ఏలూరు పాత బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, గత సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలు అమలు చేయాలని నినాదాలు చేశారు. ఈ మానవహారంతో ట్రాఫిక్ స్తభించింది. మానవహారం అనంతరం ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంఎల్‌ఎ అందుబాటులో లేకపోవటంతో ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఛైర్మన్ శివప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు పంపన రవి కుమార్, ఎం.ఇస్సాక్ మాట్లాడుతూ 2014 తర్వాత కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీలకు వేతనాలు పెంచలేదన్నారు. ప్రాజెక్టు అధ్యక్ష కార్యదర్శులు షేక్ సమీమా, రజని మాట్లాడారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు హైమావతి, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి జె.గోపి, రైతు సంఘం నాయకులు కోటేశ్వరావు మద్దతు ప్రకటించి మాట్లాడారు. అంగన్వాడీ యూనియన్ నాయకులు అరుణ, రామలక్ష్మి, పద్మ రేణుక, విజయలక్ష్మి, జయలక్ష్మి, కుమారి పాల్గొన్నారు.

ఏలూరులో...

ముదినేపల్లి : మండల కేంద్రమైన ముదినేపల్లిలో అంగన్వాడీ బ్లాక్ డే నిర్వహించారు. అనంతరం గురజ రోడ్డు సెంటర్‌లో మానవహారం చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు బండి పద్మ, అరుణ కుమారి, పి.సరస్వతి, జి.రిబ్కా, భాగ్యలక్ష్మి, పెద్ద సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెంలో...

బుట్టాయగూడెం : బుట్టాయగూడెంలో అంగన్‌వాడీలు నల్ల చీరలు ధరించి నిరసన తెలిపారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి నెహ్రూ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి అక్కడ మానవహారం చేశారు. ఈ కార్యక్రమానికి అంగన్వాడీ ప్రాజెక్ట్ కార్యదర్శి కె.పుష్ప అధ్యక్షత వహించారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి మొడియం నాగమణి అంగన్వాడీ వర్కర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ శేఖర్, రామలక్ష్మి, సుధ, భూదేవి, సీత, రామయమ్మ, వీరమణి, మంగ, ఐఎఫ్‌టియు నాయకులు ఆకాశమ్మ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్ మద్దతు తెలిపారు.

టి.నర్సాపురం : అంగన్వాడీ కార్యకర్తల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మాణిక్యమ్మ డిమాండ్ చేశారు. బ్లాక్ డే నిర్వహించి ప్రధాన సెంటర్‌లో ధర్నా చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో డిటి స్రవంతికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి అనుమోలు మురళి, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని చిన్న గాంధీ బొమ్మ సెంటర్‌లో సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు జి.రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఎంఆర్.హనుమాన్లు, ఆదిలక్ష్మి, మణి, అరుణ, ప్రసన్న, విజయలక్ష్మి, పద్మ, భవాని తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు : దెందులూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా, మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు పి.రామకృష్ణ, మండల కార్యదర్శి పి.రమాదేవి మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ బి.సుమతికి వినతిపత్రం అందించారు. దీనిపై స్పందించిన తహశీల్దార్ మాట్లాడుతూ అంగన్వాడీల సమస్యలను కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బి.రంగమ్మ, పి.జ్యోతి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : ఫైర్ స్టేషన్ సెంటర్‌లో అంగన్వాడీలు నల్ల చీరలు ధరించి నిరసన తెలిపారు. అనంతరం మానవహారంగా ఏర్పడ్డారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు డి.సత్యనారాయణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ నాయకులు ఎన్.సరోజిని, జి.సరళ దేవి, ఎం.అరుణ, బి.ఫణివర్ధిని, నాయకులు కవిత, హేమ లత, జగదీశ్వరి, పాపారత్నం, ఎఐటియుసి నాయకులు జి.అంజమ్మ, సిఐటియు మండల కన్వీనర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



భీమడోలులో...

మండవల్లి : కైకలూరు ఐసిడిఎస్ మండవల్లి మండలం లోని మూడు సెక్టార్ల పరిధిలోని అంగన్వాడీలు మానవహారం, ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల అధ్యక్షురాలు కె.చెల్లమ్మ మాట్లాడుతూ ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, ఎఫ్ఆర్ఎస్ యాప్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, ఉమా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నూజివీడులో...

ముసునూరు : మండల కేంద్రమైన ముసునూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడీలు, ఆశాలు నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ డి.ప్రశాంతికి వినతపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాసరావు, అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి పి.రాజకుమారి, అక్కిరెడ్డిగూడెం సెక్టార్ లీడర్ దుర్గా, ముసునూరు సెక్టార్ లీడర్ శ్యామల పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : జాతీయ రహదారిపై సిఐటియు ఆధ్వ ర్యంలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు నల్ల రిబ్బన్లు ధరించి మానవహారం చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.కొండలరావు మాట్లాడారు. అనంతరం తహశీల్దార్ ఉదయ్‌భాస్కర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు కో-కన్వీనర్ ఊర్ల నాగమణి, అంగన్వాడీ కార్యకర్తలు టి.ఎస్తేరు, పి.స్వర్ణ, వెంకాయమ్మ, జ్యోతి, అరుణ, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కలిదిండి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ప్రధాన రహదారిపై మానవహారం నిర్వహించారు. అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్‌కె.అబీదా బేగం మాట్లాడారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎస్.మహంకాళిరావు, రైతు సంఘం నాయకులు సిహెచ్.శ్రీకాంత్ మద్దతు తెలిపారు. అనంతరం తహశీల్దార్ ఎల్‌విఎస్.రామకృష్ణకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ నాయకులు జె.మేనకలక్ష్మి, సూర్యకుమారి, ప్రమీలారాణి, సాయమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. మానవహారం చేసి తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు పి.సూర్యారావు, ప్రాజెక్ట్ అధ్యక్షులు జి.విమల, సుబ్బయమ్మ, లక్ష్మీదేవి, సత్యవేణి, శిరోమణి, షకీలా, మున్సిపల్ నాయకులు బి.బాలరాజు, పట్టణ నాయకులు వి.గోపీ, తదితరులు పాల్గొన్నారు.



చింతలపూడిలో...

కుక్కునూరు రూరల్ : కుక్కునూరు మండల కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ యర్రం సాయికిరణ్ మాట్లాడారు. అంగన్వాడీలు బాడిస సుజాత, సున్నం పార్వతి, అన్నపూర్ణ, భవాని, వందన, రాజమ్మ, రోజా, ఆర్‌వి.రమణ పాల్గొన్నారు.

భీమడోలు : అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో భీమడోలు జంక్షన్ నుంచి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా నిర్వహించి డిప్యూటీ తహశీల్దార్‌కు వినతిపత్రం అందించారు. ధర్నాకు యూనియన్ భీమడోలు ప్రాజెక్టు అధ్యక్షురాలు వి.స్వర్ణకుమారి అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ కె.వెంకటేశ్వరరావు, అంగన్వాడీ యూనియన్ నేతలు చల్లమని బిందు, రేవతి, మల్లేశ్వరి, అపర్ణ, రాధా, తదితరులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెంలో...

కొయ్యలగూడెం : తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేసి డిప్యూటీ తహశీల్దార్ వైవివి.లక్ష్మీకుమారికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్ల బోయిన రాంబాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు కొయ్యలగూడెం కమిటీ అధ్యక్షురాలు ఎం.గంగారత్నం, కమిటీ సభ్యురాలు బి.భాగ్యలక్ష్మి, సెక్టార్ కమిటీ సభ్యులు మోహనలక్ష్మి, నాగమణి, కె.శాలిని, మేరీ షేక్ నూర్జహాన్, పి.శారద, అడప జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

వేలేరుపాడు రూరల్ : తహశీల్దార్ కార్యాలయం వద్ద సిఐటియు, ఎఐటియుసి ఆధ్వర్యంలో నల్ల చీరలు ధరించి నిరసన తెలిపారు. సిఐటియు, ఎఐటియుసి జిల్లా నాయకులు మడివి దుర్గారావు, కారం దారయ్య మాట్లాడారు. అనంతరం డిటి భుజంగరావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ జిల్లా నాయకులు సువ్వేటి లత, ఎఐటియుసి జిల్లా నాయకులు కౌలూరి సైదా, సిఐటియు మండల కార్యదర్శి మడకం నాగమణి, సోడే లక్ష్మి సుహాసిని ఆసి నయోమి, ఎఐటియుసి మండల నాయకులు పిట్టా రమణ, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమలలో మానవహారం చేసి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి తులసి, ప్రాజెక్టు కార్యదర్శి అనంతలక్ష్మి మాట్లాడారు. సంఘీభావంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కట్టా భాస్కరరావు పాల్గొని మాట్లాడారు. యూనియన్ మండల నాయకులు హేమలత, సత్యప్రియ, నాగలక్ష్మి, సుష్మ, తదితరులు నాయకత్వం వహించారు.

నిడమర్రు : నిడమర్రులో నిరసన ప్రదర్శన నిర్వహించి జంక్షన్‌లో మానవహారం చేశారు. సెక్టార్ నాయకులు ఎ.నాగమణి, టి.వెంకటలక్ష్మి, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణరావు మాట్లాడారు. టి.ఉమా, సుభాషిణి, అరుణ, సునీత, విమల, సిఐటియు మండల కన్వీనర్ కానూరు రాజు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

ఇటీవల కాలంలో వర్షాలు అధికంగా కురవడంతో ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండి రోగాలు దరి చేరకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పరిషత్ సిఇఒ ఎం.శ్రీహరి సూచించారు. మండలంలోని రాచన్నగూడెంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని గ్రామానికి చెందిన పలువురు ఐవిఆర్ఎస్ కాల్‌కు ఫిర్యాదు చేయడంతో ఆయన గురువారం గ్రామంలో పర్యటించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా పలుచోట్ల చెత్తను క్లాప్ మిత్రలతో ఎత్తించారు. ఈ సందర్భంగా సిఇఒ మాట్లాడుతూ గ్రామాల్లో చెత్త లేకుండా చూడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శిదేనన్నారు. అనంతరం క్లాప్ మిత్రాలతో మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి తయారీ కేంద్రాల్లో వేసి పంచాతీలకు ఆదాయాన్ని సమకూర్చాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్, సర్పంచి సున్నం వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి గిరిజ, ఎఫ్‌టిసి నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఎన్నిక

అధ్యక్ష కార్యదర్శులుగా ఎర్ర రాంబాబు, నారపల్లి రమణరావు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఎర్ర రాంబాబు

రమణరావు

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులుగా ఎర్ర రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా నారపల్లి రమణరావు ఎన్నికయ్యారు. ఏలూరులో గురువారం ముగిసిన ఆరో జిల్లా మహాసభలో నూతన కమిటీ ఎన్నికైంది. గౌరవ అధ్యక్షులుగా డిఎన్‌విడి.ప్రసాద్, కోశాధికారిగా రెడ్డి లక్ష్మణరావు, జిల్లా ఉపాధ్యక్షులుగా తాడి సత్యనారాయణ, షేక్ భాషా, కెల్లా దుర్గాప్రసాద్, ఎం.ఇస్సాక్, జిల్లా సహాయ కార్యదర్శులుగా సిహెచ్.కొండలరావు, ఆది కృష్ణ, సీర అప్పారావు ఎన్నికయ్యారు. భవన నిర్మాణ కార్మికుల వెల్ఫేర్ బోర్డు వెంటనే పునరుద్ధరించాలని, పెండింగ్ క్లైములు వెంటనే పరిష్కరించాలని, భవన నిర్మాణ మెటీరియల్ ధరలు తగ్గించాలని మహాసభలో తీర్మానించారు. ఈ డిమాండ్ల పరిష్కారానికి భవిష్యత్తులో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించారు.

సుధాకర్‌కు డివైఇఒగా ఉద్యోగోన్నతి

యుటిఎఫ్ నేతల శుభాకాంక్షలు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి జిల్లా పరిషత్ హై స్కూల్‌లో ప్రధానోపాధ్యాయులుగా పనిచేస్తున్న సుధాకర్‌కు డివైఇఒగా ఉద్యోగోన్నతి రావడం అభినందనీయమని యుటిఎఫ్ జిల్లా నాయకులు పురేటి శ్రీనివాసరావు, అప్పారావు అన్నారు. సుధాకర్‌కు వారు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్.రాజేంద్ర, యుటిఎఫ్ నాయకులు దామోదర్, ప్రేమ్ కుమార్, బుచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఒసి చెక్కు అందజేత

ప్రజాశక్తి - ముసునూరు

పేద, బడుగు, బలహీన తరగతుల వారికి అండగా ఉంటూ అనారోగ్యానికి గురైన వారిని ఆర్థికంగా ఆదుకుంటామని మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. మండలంలోని లోపూడి గ్రామానికి చెందిన పేరం మహేష్‌బాబుకు మెరుగైన వైద్య చికిత్స నిమిత్తం రూ.3.5 లక్షల విలువైన ఎల్‌ఒసి చెక్కును మంత్రి అందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అనారోగ్యానికి గురై ఆర్థికంగా వెనుకవడినవారిని టిడిపి కూటమి ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఫారెస్ట్ సిబ్బందిపై దాడి హేయం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

శ్రీశైలంలో ఫారెస్ట్ సిబ్బందిపై దాడి చేయడాన్ని ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాజమండ్రి సర్కిల్ అధ్యక్షులు, నూజివీడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ టి.సత్యనారాయణ తీవ్రంగా ఖండించారు. నూజివీడులో ఆయన గురువారం మాట్లాడుతూ ఫారెస్ట్ అధికారులపై దాడి చేసిన ఎంఎల్ఎ బుడ్డా రాజశేఖర్‌రెడ్డిపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిత్యం అడవుల పరిరక్షణ ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శ్రీశైలం అటవీ ప్రాంతంలో నిత్యం అడవుల పరిరక్షణ కోసం విధులు నిర్వర్తిస్తున్న ఫారెస్ట్ అధికారులపై దాడులు చేయడం దారుణమన్నారు. దాడులను ఖండిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు ఆందోళన చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు వివరించారు.

ఎరువుల కొరత లేకుండా చూడాలి

రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని రైతాంగానికి ఎరువుల కొరత లేకుండా చూడాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు జానకిరామిరెడ్డి, సీతారామయ్య మాట్లాడారు. కూటమి ప్రభుత్వం సకాలంలో రైతులకు ఎరువులు అందుబాటులో లేకుండా చేస్తూ రైతులను మభ్యపెడుతూ ఆట్లాడుకుంటుందన్నారు. రైతులకు రాయితీ ఎరువులు తక్షణమే అందుబాటులో తీసుకురాకుంటే మండలంలోని రైతులను సమీకరించి ఉద్యమిస్తామని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిరిబత్తుల సీతారామయ్య అధికారులకు విజ్ఞప్తి చేశారు. మండలంలో యూరియా దొరకక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఇలాగే కొనసాగితే రానున్న కాలంలో రైతులు ఉద్యమానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సుంకవల్లి శేషగిరిరావు, ముంగమూరు ప్రభాకర్, రమణ పాల్గొన్నారు.

విజయశ్రీకి విశ్వజనని సేవా జ్యోతి అవార్డు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

జంగారెడ్డిగూడెం పట్టణానికి చెందిన రోడ్డా విజయశ్రీ ప్రస్తుతం ఏలూరులో నివసిస్తున్నారు. ఆమె సోషల్ యాక్టివిటీస్‌లో భాగంగా హైదరాబాద్ విశ్వజనని ఫౌండేషన్ వారు హైదరాబాద్ పొట్టిశ్రీరాములు యూనివర్సిటీలో బుధవారం విశ్వజనని సేవా జ్యోతి అవార్డు పలు ప్రముఖుల చేతులమీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా విజయ శ్రీ మాట్లాడుతూ నా సేవలను గుర్తించి అవార్డు అందించిన ప్రతిఒక్కరికీ రుణపడి ఉంటానన్నారు. విశ్వజనని ఫౌండేషన్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వజనని ఫౌండేషన్ వారు, కొంతమంది సినిమా ఆర్టిస్టులు, సీరియల్ ఆర్టిస్టులు పాల్గొన్నట్లు తెలిపారు.

అక్షరాంధ్రపై శిక్షణ

ప్రజాశక్తి - మండవల్లి

నిరక్షరాస్యతను పోగొట్టి సంపూర్ణ అక్షరాస్యతను తీసుకురావడమే అక్షరాంధ్ర కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎపిఎం జి.రాజశ్రీ స్పష్టం చేశారు. స్థానిక వెలుగు కార్యాలయంలో అక్షరాంధ్ర కార్యక్రమానికి ఎంపిక చేసిన వాలంటీర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని గురువారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరక్షరాస్యతను పోగొట్టి వంద శాతం అక్షరాస్యత సాధించేందుకు వయోజన విద్యాశాఖ అక్షరాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మండలంలోని గ్రామాల్లో గతేడాది ఫిబ్రవరిలో నిర్వహించిన సర్వేలో సుమారు నాలుగు వేలకు పైగా నిరక్షరాస్యులు ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరిలో 2500 మంది మహిళలను మహిళా సంఘాల ద్వారా అక్షరాస్యులను చేసే విధంగా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేసామని తెలిపారు. పురుషులకు ఉపాధి హామీ సిబ్బంది ద్వారా అక్షరాలను నేర్పిస్తామని చెప్పారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వం ఉల్లాస్ కింద నిధులు కేటాయించడంతో రానున్న మూడు నెలల్లో రాష్ట్రంలోని 75 లక్షల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు ఆవులు స్వర్ణకుమారి, సెక్రటరీ బాడవుల లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

23 నుంచి సిపిఐ రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

సిపిఐ 28వ రాష్ట్ర మహాసభ జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వరక శ్యామల, మన్నవ యామిని పిలుపునిచ్చారు. స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో గురువారం వారు మీడియాతో మాట్లాడుతూ ఒంగోలులో ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు మహాసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహాసభలో రాష్ట్రంలో మహిళల సమస్యలతో పాటు ప్రజానీకం ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చిస్తారని, భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందిస్తారని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పేరుకే మోడల్ స్కూల్.. ఆచరణ నిల్

బోగస్ రోల్‌తో నిధుల దుర్వినియోగం

ప్రజాశక్తి - ముదినేపల్లి

కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన మోడల్ పాఠశాలలు ముదినేపల్లి మండలంలోని విద్యాశాఖాధికారులు ఇష్టారాజ్యంగా ఏర్పాటు చేయటంతో పాటు ప్రస్తుతం రోల్ నిలుపుకునేందుకు బోగస్ విద్యార్థుల నమోదు చేస్తున్నా పరిస్థితి నెలకొంది. ముదినేపల్లి మండలంలో ఏడు మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేయగా అందులో రెండింట్లో మాత్రమే 60 మంది పైగా విద్యార్థులున్నారు. మిగిలిన అన్ని పాఠశాలల్లో 60 మంది లోపు విద్యార్థులుండగా, చిగురుకోట మోడల్ పాఠశాలల్లో 45 మందికి పైగా ఉన్నారు. మిగిలిన అన్ని పాఠశాలల్లో 45 మంది లోపు విద్యార్థులున్నారు.

రంగాపురం మోడల్ పాఠశాల ప్రత్యేకత వేరు

ముదినేపల్లి-కైకలూరు రోడ్డులో నేషనల్ హైవేలో ఉన్న రంగాపురం మోడల్ పాఠశాలల్లో గతంలో 3, 4, 5 తరగతులు హైస్కూల్లో విలీనం చేయడంతో 1, 2 తరగతులు మాత్రమే ఉండేవి. ప్రభుత్వం మోడల్ పాఠశాలలను ఏర్పాటు చేయాలని తెలపడంతో సమీపంలో ఉన్న ముదినేపల్లి హైస్కూల్లో చదువుతున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులను రంగాపురం పాఠశాలలో నమోదు చేయడంతో 60 మందికి పైగానే విద్యార్థులు ఉన్నట్లు ఏర్పాటు చేయడంతో 1 ప్లస్ 4 ఉపాధ్యాయులను ప్రభుత్వం కేటాయించింది. ఇందులో వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చి 3, 4, 5 తరగతుల విద్యార్థులే అధికంగా ఉండటం గమనార్హం. గతంలో ఇదే పాఠశాలలో 1, 2, తరగతులు కలిపి 21 మంది విద్యార్థులను చూపగా కేవలం పది మంది లోపు విద్యార్థులే హాజరయ్యేవారు. ప్రస్తుతం ఈ పాఠశాలలో 44 మంది విద్యార్థులను చూపుతుండగా కేవలం 25మంది విద్యార్థులు హాజరవ్వుతున్నారు. అయినా ప్రతిరోజూ పూర్తిస్థాయిలో 44 మంది విద్యార్థులు హాజరవ్వుతున్నట్లు సంబంధిత శాఖ అధికారులే ఆ పాఠశాల ఉపాధ్యాయులకు వత్తాసు పలకడం గమనార్హం. ఇదే పాఠశాలలో సంబంధిత విద్యాశాఖాధికారి ఒకరు అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు ప్రజల నుంచి పలు విమర్శలు వినిపిస్తున్నాయి.

భవితలో విద్యార్థులు ఇక్కడే...

ముదినేపల్లి హై స్కూలులో ఉన్న భవిత కేంద్రంలో ఉన్న విద్యా ర్థులను రంగాపురం పాఠశాలలో నమోదు చేస్తున్నారు. ఆయా పిల్లలు ఆయా గ్రామాల నుంచి వస్తున్న ఆయా గ్రామాల పాఠశాలల్లో నమోదుగా చూపించాల్సి ఉండగా అందుకు భిన్నంగా రంగాపురం పాఠశాలలో బోగస్ రోల్‌గా నమోదు చేస్తుండటంతో నిధులు దుర్వినియోగం అవుతున్నాయి.

మధ్యాహ్న భోజన పథకం దుర్వినియోగం

రంగాపురం పాఠశాలలో ప్రతిరోజూ 25 మంది విద్యార్థులు మాత్రమే హాజరవుతుండగా మధ్యాహ్న భోజనం చేస్తుండగా నమోదులో మాత్రం పూర్తిస్థాయిలో 44 మంది హాజరు చూపిస్తున్నారు. ప్రతిరోజూ 15 మందికి పైగానే విద్యార్థులకు చెల్లించే కోడిగుడ్లు, చిక్కిలు, విద్యార్థి మొత్తం రెండు రోజులకు ఒకసారి చిక్కీలు, ప్రతిరోజు రెండు కేజీలు బియ్యంతో పాటు అదనంగా కుక్కు, అదనంగా హెల్పర్‌కి కూడా వేతనం దుర్వినియోగమవుతుంది. దీనిపై ఎవరైనా విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తే ఆ పాఠశాలలో కొంతమంది ఉపాధ్యాయులు సంఘ నాయకులను తిట్టిస్తుండడం గమనార్హం.

చాలా స్కూళ్లో 20 మంది లోపే విద్యార్థులు

మండలంలో అనేక పాఠశాలల్లో కేవలం 17 నుంచి 18 మంది విద్యార్థులు ఉన్న కూడా బోగస్ రోల్ నమోదుతో 21 పైగా విద్యార్థులను చూపిస్తున్నారు. ఈ విధంగా చూపిస్తున్న సంబంధిత మండల విద్యాశాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించటం విమర్శలకు తావిస్తోంది. జిల్లా విద్యాశాఖ అధికారులు రంగాపురం మోడల్ స్కూల్‌ను పరిశీలించి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం కాకుండా చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

కొండలరావుపాలెంలో ఉద్రిక్తత

కొల్లేరు గ్రామాల ప్రజలు, అబ్బయ్య చౌదరి గ్రూపుల మధ్య పరస్పర ఆరోపణలు, తోపులాటలు

అడ్డుకున్న పోలీసులు

ప్రజాశక్తి - దెందులూరు

పెదవేగి మండలం కొండలరావుపాలెంలో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. కొల్లేరు ప్రజల బకాయి డబ్బులు చెల్లించాలంటూ దెందులూరు మాజీ ఎంఎల్ఎ అబ్బయ్యచౌదరి ఇంటిని కొల్లేరు గ్రామాల ప్రజలు మరోసారి ముట్టడించారు. అబ్బయ్య చౌదరి పొలంలో పామాయిల్ గెలలు కోయడాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో ఒక్క సారిగా ఘర్షణ వాతావరణం నెలకొంది. అటు కొల్లేరు ప్రజలు, ఇటు అబ్బయ్య చౌదరి అభిమానుల మధ్య తోపులాటలు చోటు చేసుకున్నాయి. పోలీసులు భారీగా మోహరించి పరిస్థితిని చక్కదిద్దారు.

రణరంగంగా కొండలరావుపాలెం

అబ్బయ్య చౌదరి ఇంటిని ముట్టడించడానికి కొల్లేరు లంక గ్రామాలైన శ్రీపర్రు, ప్రత్తికోళ్లలంక నుంచి వందలాది మంది గురువారం ఉదయానికి రాయన్నపాలెం, కొండలరావుపాలెం చేరుకున్నారు. అప్పటికే మాజీ ఎంఎల్ఎ అబ్బయ్యచౌదరికి చెందిన వ్యవసాయ క్షేత్రంలో కూలీలు పామాయిల్ గెలలు కొస్తుండటంతో కొల్లేరు ప్రజలు అక్కడికి చేరుకుని వాటిని అడ్డుకోబోయారు. వైసిపి శ్రేణులు, అబ్బయ్య చౌదరి అభిమానులు భారీగా అక్కడికి చేరుకున్నారు. వారితో కలిసి మాజీ ఎంఎల్ఎ

ఎంఎల్ఏతో మాట్లాడుతున్న పోలీసులు

అబ్బయ్యచౌదరి తోటలోకి వెళ్లారు. ముందస్తు సమాచారంతో నూజివీడు డిఎస్‌పి వైవిఎన్.ప్రసాద్ నేతృత్వంలోని పోలీసులు కూడా భారీ ఎత్తున మోహరించి ఇరు గ్రూపులను ఆపేందుకు ప్రయత్నించారు. అటు కొల్లేరు ప్రజలు, టిడిపి శ్రేణులు, ఇటు అబ్బయ్య చౌదరి, ఆయన అభిమానులు, వైసిపి శ్రేణులు ఒకరిపై ఒకరు ఆరోపణలు, ప్రత్యారోపణలు, తీవ్ర విమర్శలతో అక్కడి వాతావరణం రణరంగంగా మారింది. 144 సెక్షన్ అమలులో ఉందని, గుంపులుగా ఉండకూడదని పోలీసులు హెచ్చరిస్తున్నా ఎవరూ పట్టించుకోలేదు. అబ్బయ్యచౌదరి ఏలూరు వెళ్లి ఎస్‌పికి వినతిపత్రం ఇచ్చారు.

రూ.8 కోట్ల బకాయిలు రావాలి : కొల్లేరు గ్రామాల ప్రజలు

అబ్బయ్యచౌదరి 2019-24 మధ్య ఎంఎల్ఎగా పనిచేసిన కాలంలో తమకు చెందిన చెరువులను లీజులకు తీసుకుని, ఇప్పటి వరకు గ్రామాలకు చెల్లించలేదని, ఆ మొత్తం రూ.ఎనిమిది కోట్ల వరకు తమకు రావాల్సి ఉంటుందని శ్రీపర్రు, ప్రత్తికొళ్ల లంక కొల్లేరు గ్రామాల ప్రజలు పేర్కొన్నారు. తాము లీజులు ఇవ్వాలన్నట్లు ఆధారాలు ఉంటే తీసుకొస్తే అప్పుడు లీజులు ఇస్తామని, అంతేగానీ రాజకీయ కారణాలతో దుర్మార్గంగా, దౌర్జన్యంగా తమ పొలంలోకి వచ్చి పనులను అడ్డుకునే ప్రయత్నం చేస్తే చూస్తూ ఊరుకోమని అబ్బయ్య చౌదరి పేర్కొన్నారు. తమ పొలంలోకి టిడిపికి చెందిన వారు వస్తే అడ్డుకోకుండా తనను ఆపడం ఏంటని అబ్బయ్యచౌదరి పోలీసులను పదే పదే ప్రశ్నించారు. పలుమార్లు అబ్బయ్యచౌదరి నేలపై కూర్చుని నిరసన తెలిపారు. అందుకు ప్రతిగా కొల్లేరు ప్రజలు, కూటమి నాయకులు ఆందోళన తీవ్ర స్థాయిలో చేపట్టారు. 41 పామాయిల్ చెట్లు, 35 గంధం చెట్లు, 25 ఒక్క చెట్లు మాయం చేశారని, ఎవరు ఎంత భయపెట్టినా భయపడబోమని అబ్బయ్యచౌదరి పేర్కొన్నారు. తమకు లీజులు ఇవ్వాలని పది నెలలుగా అబ్బయ్య చౌదరి ఇంటి ముందు ఆందోళన చేస్తున్నా పట్టించుకోకపోవడాన్ని కొల్లేరు ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.

వంతెన నిర్మాణానికి ఎంపీ కృషి

పలువురి అభినందనలు

ఏలూరు సిటీ : భీమడోలు మండలం గుండుగొలను వద్ద ఏలూరు కాలువపై వంతెన నిర్మాణం పూర్తయ్యేలా కృషి చేసినందుకు ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్‌కు స్థానిక ప్రజలు, నాయకులు ధన్యవాదాలు తెలిపారు. అయితే గతంలో నిర్మాణానికి నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రూ.3.40 కోట్లు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ అనంతరం గుత్తేదారు వంతెన నిర్మాణం ప్రారంభించారు. ఏలూరు కాలువపై అనుమతి తీసుకోకుండా తమ శాఖ మార్గదర్శకాల మేరకు వంతెన నిర్మాణం చేపట్టడం లేదని, పనులు తక్షణం నిలిపివేయాలని ఇంగ్లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాలు జారీ చేసింది. దీంతో స్లాబ్ దశ వరకు చేరిన వంతెన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. అనంతరం భీమడోలు పర్యటనకు వెళ్లిన పుట్టా మహేష్‌కుమార్ దృష్టికి స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రజలు తమ సమస్యను తీసుకెళ్లారు. దీంతో ఏలూరు ఎంపీ కార్యాలయంలో ఎన్‌హెచ్ఎఐ, ఐడబ్ల్యుఎఐ అధికారులతో చర్చించి వంతెన వద్ద పర్యటించి అక్కడ ప్రజలు పడుతున్న ఇబ్బందులను స్వయంగా పరిశీలించారు. అనంతరం ఎంపీ ఇంగ్లాండ్ వాటర్ వేస్ అథారిటీ ఆఫ్ ఇండియా ఛైర్మన్‌ను స్వయంగా కలిసి వంతెన నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరగా వారు సానుకూలంగా స్పందించి సహకరించారు. దీంతో వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఎంపీ మహేష్‌కుమార్‌కు స్థానిక ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా 'మానవత' ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆవిర్భావ దినోత్సవాన్ని జంగారెడ్డిగూడెంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మానవత జంగారెడ్డిగూడెం అధ్యక్షులు అల్లూరి రామకృష్ణ అధ్యక్షతన, కార్యదర్శి తుట్టగుంట మధుకుమార్ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని స్థానిక బాలుర హైస్కూల్ హెచ్ఎం సోమశేఖర్ జెండా ఊపి ప్రారంభించారు. రామకృష్ణ మాట్లాడుతూ సంస్థ ద్వారా సమాజంలో కష్టాల్లో ఉన్న పేదలకు, విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్నామని తెలిపారు. పూర్వ అధ్యక్షులు పి.ఎ.కృష్ణమూర్తి మాట్లాడుతూ మానవత సంస్థ ద్వారా శాంతి రథాలు, ఫ్రీజర్ బాక్సులు, అంబులెన్స్ సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఈ శాంతి ర్యాలీలో జంగారెడ్డిగూడెం ఎస్ఐ షేక్ జబీర్, ప్రభుత్వ బాలుర హై స్కూల్, ప్రతిభ, విద్యావికాస్ స్కూల్స్, సూర్య కాలేజీ విద్యార్థులు, ఉపాధ్యాయులు, స్థానిక పుర ప్రముఖులు, మానవత కేంద్ర, జిల్లా కమిటీ, కమిటీ, మండల కమిటీ, మండల పర్యావరణ పరిరక్షణ కమిటీ, మండల ఆత్మీయ సహకార కమిటీ, మానవత సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కమిషనర్‌ను కోరిన వైఎస్ఆర్ కాలనీ విద్యార్థులు

ప్రజాశక్తి - చింతలపూడి

మా కాలనీలో సమస్యలు పరిష్కరించాలని చింతలపూడి నగర పంచాయతీ వైఎస్ఆర్ కాలనీ విద్యార్థులు కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు విద్యార్థులు గురువారం కమిషనర్‌ను కలిసి సమస్యలు వివరించారు. కాలనీలో సరైన రోడ్డు లేదన్నారు. డ్రెయినేజీలో మురికి నీరు రోడ్డుపైకి రావడంతో నడిచేందుకు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. రాత్రి సమయంలో దోమలతో నరకయాతన పడుతున్నామన్నారు. కాలనీలో సమస్యలు పరిష్కరించాలని కోరారు.

చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాలు

ఏలూరు సిటీ : మెగాస్టార్ చిరంజీవి పుట్టినరోజు వారోత్సవాలు ఏలూరులో చిరంజీవి యువత ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. సేవా కార్యక్రమాల్లో భాగంగా గురువారం ఏడో రోజు సోమవారపాడులో ఉన్న సెయింట్ జోసెఫ్ మానసిక వికలాంగుల వసతి గృహంలో పిల్లలకు భోజనం పెట్టి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్‌టిసి విజయవాడ రీజనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, జనసేన నాయకుడు నారా శేషు హాజరయ్యారు. తొలుత అభిమానుల సమక్షంలో కేక్ కటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏలూరు చిరంజీవి యువత అధ్యక్షులు రామకృష్ణమూర్తి, హనుమంతరావు, ఈదుపల్లి పవన్, కట్ట ఆది, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు పూర్వ విద్యార్థి చేయూత

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని మద్దాయికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా పాఠశాల పూర్వ విద్యార్థి ఆర్మూర్ గోవింద్ పాఠశాలకు వార్తపత్రిక ఏర్పాటుకు వార్షిక బిల్లు నగదు మొత్తాన్ని ప్రధానోపాధ్యాయులకు అందించారు. ప్రధానోపాధ్యాయులు దారపురెడ్డి భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థుల్లో మాతృభాషా పఠన నైపుణ్యాన్ని పెంపొందించడానికి, రోజు విద్యార్థులు వార్తాపత్రికలు చదవాలని సూచించారు. వివిధ కవులు, వారి జీవిత విశేషాలు, ఆనాటి రాజులు కవులకు ఇచ్చిన ప్రాధాన్యం ద్వారా భాషాభివృద్ధి జరిగిందని తెలిపారు. తెలుగు ఉపాధ్యాయులు యు.శివనాగరాజు మాట్లాడుతూ ప్రముఖ కవులు నన్నయ్య, తిక్కన, ఎర్రన, పోతన, శ్రీనాథుడు, వేమన, శ్రీ శ్రీ, గుర్రం జాషువా వంటి కవులు తెలుగు భాషకు ఎంతో సేవ చేశారన్నారు. ఎస్ఎంసి ఛైర్మన్ ఎర్రబాల శివరామకృష్ణ, ఉపాధ్యాయులు పాగోలు నాగేంద్రరావు, బి.జాన్సన్‌లు ఆర్మూర్ గోవింద్‌ను అభినందించారు.

కబ్జా కోరల్లో ఇరిగేషన్ భూమి

అనధికారికంగా తూములు ఏర్పాటు

పట్టించుకోని అధికారులు

పజాశక్తి - ముదినేపల్లి

పంట బోదెపై తూములు

ఇరిగేషన్ భూములు కబ్జాకు గురవుతున్నా నీటి పారుదల శాఖాధికారులు తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముదినేపల్లి పోల్‌రాజు కాలువ నుంచి హై స్కూల్ పక్కనుంచి పెయ్యేరు పంటపొలాలకు వెళ్లే కాలువ ఇది. ఒక కంపెనీ యజమాని రాజకీయ అండదండలతో ఎటువంటి అనుమతులు లేకుండా తూములు ఏర్పాటు చేశారు. సుమారు 400 ఎకరాలకు సాగు నీటిని అందించే పంట బోదెను అడ్డగోలుగా పూడ్చి దానిపైన తూములు వ్యాపారం చేసుకుంటున్నారు. తూముల పరిశ్రమకు అనుమతులు ఉన్నాయో లేదో అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. పెయ్యేరు పంచాయతీ శివారులో చోటు చేసుకున్న ఇలాంటి సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ సంఘటనపై గతంలో ఇరిగేషన్ అధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఈ బోదెను వైఎస్ఆర్ కాలనీ వాసులు కూడా గతంలో డ్రెయిన్‌కు ఇవ్వాలని అధికారులను కోరిన పట్టించుకునేవారే కరువయ్యారు. వర్ల కంపెనీ యాజమాని కోసం ఈ బోదెను మరమ్మతులు చేస్తే అతనికి నష్టం కలుగుతుందన బాధతో అధికారులు కూడా కళ్ళకి గంతలు కట్టుకుని ఉండడం గమనార్హం. సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి భూమిని కబ్జా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని వైఎస్ఆర్ కాలనీ ప్రజలు, రైతులు కోరుతున్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావత్ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా మహారాజశ్రీ గౌరవ ప్రిన్సిపల్ జిల్లా జడ్జి వరంగల్ కోర్టులో...

M.V.O.P NO. 52 OF 2024

బొల్లం ప్రవంతి ...వాది

మరియు

బి మోహన్ రావు మరియు ఇతరులు ...ప్రతివాదులు

పై దావా యందు వాది, ప్రతివాది నెం.1 అయిన బి మోహన్ రావు, S/o. మునియ్య, వయస్సు : మేజర్, వృత్తి : డ్రైవర్ ఆఫ్ ద క్రైమ్ వెహికిల్, నివాసం : 3-5A, పూలపల్లి పాలకొల్లు, వెస్ట్ గోదావరి జిల్లా - 534260 గారికి కోర్టు నుండి మరియు రిజిస్టర్ పోస్టు ద్వారా నోటీసులు పంపించగా అవి ముట్టనందున ఈ బహిరంగ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా పైన తెలిపిన దావాలో మీరు **తేది : 10-05-2025 రోజున ఉదయం 10.30 ని॥లకు** మీరు గానీ మీ తరపున న్యాయవాది గాని గౌరవ ప్రిన్సిపల్ జిల్లా జడ్జ్, వరంగల్ కోర్టు వారి ముందు హాజరు కాగలరు. లేని యెడల పరోక్షమున కోర్టు వారి నుండి ఉత్తర్వులు జారీ చేయబడును.

// గౌరవ కోర్టు వారి ఉత్తర్వులతో //

ఆడెపు దేవేందర్, అడ్వకేట్

ఇ.నెం. 17-3-258, ఉర్సుగుట్ట దగ్గర, కరీమాబాద్, వరంగల్, సెల్ : 8897585852

PUBLIC NOTICE

IN THE COURT OF THE ADDL. CIVIL JUDGE, (SENIOR DIVISION), ELURU.

O.S.No.121/2024

Between:

Musunuri Kumari Lakshmi And another ...Plaintiff

And

Moravineni Sasirekha And 4 Others ...Defendants

To.

D2: Moravineni Sai Narayana, S/o.Late Krishna Rao, R/o.D.No.28-4-17, 12th Line, Santhinagar, Eluru.

Where as, the plaintiffs have filed the suit against the defendants for declaration and consequential recovery of possession of the plaint schedule property, where as the Hon'ble Court ordered notice to you and posted the matter for your appearance. Therefore, you are called upon to appear before the Hon'ble Court on **28.08.2025 at 10.30 A.M**. and state your objections if any, else the matter will be decided in your absence.

PYDI VENKATA RAJU
Advocate, Eluru.
Cell: 9885199811

IN THE COURT OF THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL (HON'BLE PRL. DISTRICT JUDGE), W.G.Dt., Eluru.

MVOP.No.300/2023

Between:

Sydu Rajyalaksmi & Others ...Petitioners

And

Kakani Rambabu & 5 Others ...Respondents

పై నెంబరు గ్రంథంలో 5వ రెస్పాండెంట్ ఘంటసాల శ్రీనివాసరావు, S/o.సోమరాజు, Driver of Mini Lorry Bearing No.AP 39 UL 3738, R/o.పైడి చింతపాడు (V), Eluru (M), ఏలూరు Dt.

అను వారికి నోటీసు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట ది.02-09-2025వ తేదీన ఉదయం గం.10.30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయ్యి తమ ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల దావా సంగతులు తమ పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

C.V.SURYA KRISHNA
ఏలూరు Advocate, Eluru.
తేది.21-08-2025 Cell: 8341664461

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - చింతలపూడి

ఈ నెల 22వ తేదీ శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆపరేషన్ జంగారెడ్డిగూడెం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పీర్.అహ్మద్‌ఖాన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చింతలపూడి 132/33 కెవి సబ్ స్టేషన్ పరిధిలోని 33 కెవి లింగపాలెం, 33 కెవి పట్టాయిగూడెం, 33 కెవి టి.నరసాపురం ఫీడర్లు, 33/11 కెవి చింతలపూడి సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి చింతలపూడి టౌన్ ఫీడర్, రేచర్ల సబ్ స్టేషన్ పరిధిలోని రేచర్ల టౌన్ ఫీడర్ రేచర్ల ఎజిఎల్ ఫీడర్లు, శెట్టివారిగూడెం సబ్ స్టేషన్ పరిధిలోని వెంకటాద్రిగూడెం ఫీడర్, రాఘవపురం సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి గణిజర్ల ఫీడర్లకు ట్రీ కటింగ్, లైన్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. వినియోగదారులందరూ విద్యుత్ శాఖ వారికి సహకరించాలని కోరారు.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని కాట్రేనిపాడు మండల పరిషత్ స్కూలులో విద్యార్థులకు పోలీస్‌స్టేషన్, శక్తి టీమ్ ఆధ్వర్యంలో గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చిరంజీవి మాట్లాడుతూ విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

IN THE COURT OF THE HONBLE I ADDL. DISTRICT JUDGE, ELURU

I.A.No.179/2025

EMC.No.1/2016

Between:

The Asst. Divisional Engineer
APEPDCL, Narasapuram, W.G.Dt., ...Petitioner

V.V.Suryanarayana & another ...Respondents

పై నంబరు పిటిషనులో R2 అయిన శ్రీ L.శ్రీనివాసరావు, S/o.సత్యనారాయణ, వయస్సు 36 సం॥లు, R/o.D.No.6-11-15, మెయిన్‌రోడ్డు, నరసాపూర్, పశ్చిమ గోదావరి జిల్లా, అను వారికి నోటీసు అమలు కొరకు **ది.19-09-2025వ** తేదీన వాయిదా ఉన్నది. సదరు వాయిదా రోజు శ్రీ మొదటి అదనపు జిల్లా కోర్టు వారి ఎదుట ఉ॥10.30 గంటలకు స్వయముగా కానీ మీ ప్లీడరు గారి ద్వారా కానీ హాజరు అయ్యి ఆక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల వారి పరోక్షమందు పిటీషను సంగతులు తీర్మానించెదరు.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారము)

ఏలూరు **E.SRINIVASA BABU**
తేది.21-08-2025 Advocate, Eluru.

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) అడిషినల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S.No.229/2021

బిట్వీన్ :

Bank of Baroda, Narsapuram Branch ...వాది

అండ్

Tirumana Narayana Murthy
Mummidivarapu Suresh ...ప్రతివాది/ప్రతివాదులు

సమన్సులు:

D1: Tirumana Narayana Murthy, S/o.Mulaswamy, D.No.3-16, Gaggiparru, Elamanchili Mandal, W.G.Dt.

D2: Mummidivarapu Suresh, S/o.Nageswara Rao, D.No.3-28, Gaggiparru, Elamanchili Mandal, W.G.Dt.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) అడిషినల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీకోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది.28-08-2025 సం॥రం తేదీన ఉదయం గం.10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియ జేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపా వారి వీధి,
నరసాపురం నరసాపురం-534275, ప.గో.జిల్లా.
తేది.21-08-2025 ఫోన్: 08814-274628

ప్రకటన

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) అడిషినల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో, నరసాపురం

O.S.No.23/2024

బిట్వీన్ :

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్, రిప్రజెంటెడ్ బై ఇట్స్ బ్రాంచ్ మేనేజర్, వీరవాసరం ...వాది

అండ్

Pattisapu Rani
Bolla Subramanyam ...ప్రతివాది/ప్రతివాదులు

సమన్సులు:

D1: Pattisapu Rani, W/o.Srinivasa Rao, D.No.3-75, Adavipalem, Konteru Sivaru, 4th Block, Gaggiparru, W.G.Dt, Pin:534280

D2: Bolla Subramanyam, S/o.Madhava Rao, D.No.4-109, 4th Block, Adivipalem, Konteru Sivaru, Gaggiparru, W.G.Dt., Pin: 534280.

మీరు వాది స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వీరవాసరం బ్రాంచ్ వారికి చెల్లించవలసిన బాకీ చెల్లించనందున మహారాజశ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) అడిషినల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ వారి కోర్టులో పై నెంబరు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో శ్రీకోర్టు వారు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను దావా సమన్లు పంపించిననూ అవి అమలు కానందున ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయునది ఏమనగా **ది.03-09-2025 సం॥రం తేదీన ఉదయం గం.10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని కోర్టుకు హాజరై మీ ఆక్షేపణలు తెలియ జేసుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున సదరు దావా విచారించబడి తీర్మానించబడునని మీకు తెలియజేయడమైనది.

మోచర్ల సత్యకృష్ణ, అడ్వకేట్
3-4-10, జంపా వారి వీధి,
నరసాపురం నరసాపురం-534275, ప.గో.జిల్లా.
తేది.21-08-2025 ఫోన్: 08814-274628